## క్లుప్తంగా

### 2న ఉపనయనాలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు

**కడప కల్చరల్ :** ఆదిశంకరాచార్యుల జయంతిని పురస్కరించుకుని మే 2వ తేదిన బ్రాహ్మణ వటువులకు ఉప నయనాలు నిర్వహించనున్నామని బ్రాహ్మణ అర్చక సంఘం నాయకులు పిడతల గోపాలకృష్ణ, బాహ్మణ సంఘాల ప్రతినిధి బ్రాహ్మణపల్లె చంద్రమౌళి శర్మలు తెలిపారు. ఆదివారం స్థానిక మున్సిపల్ మైదానంలోని శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మే 2వ తేది శ్రీ ఆదిశంకర జయంతిని పురస్కరించుకుని ఆరోజు ఉదయం 9.56 గంటలకు ఆరుద్ర నక్షత్ర యుక్త మిధున లగ్న పుష్కరాంశమందు ఉచిత సామూహిక ఉపయనయనాలు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. కడప నగరం శ్రీ రాజరాజేశ్వరీదేవి దేవస్థానంలో అన్ని బ్రాహ్మణ సంఘాలు ఏకమై ఉచిత సామూహిక ఉపనయనాలు నిర్వహించాలని నిర్ణయించాయన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సొట్టు సాంబమూర్తి, వారణాసి శ్రీధర్ శర్మ, ఆలమూరు సురేష్ శర్మ, పీవీఎస్‌వీ ప్రసాద్‌రావు, చరణ్, సాయిమిత్రశర్మ తదితరులు పాల్గొన్నారు.

### శిల్పారామంలో ఆట-పాట




శిల్పారామంలో చిన్నారుల నృత్య ప్రదర్శన

**కడప కల్చరల్ :** కడప శిల్పారామంలో ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై కళాకారులు చిన్నారులు తమ ఆటపాటలతో సందడి చేశారు. కొత్త మాధవరం-1లోని వెంకటేశ్వరపురం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు పలు జానపద, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. వారి నృత్యాలకు సందర్శకుల నుంచి విశేష స్పందన లభించింది. ముఖ్యంగా దేశ భక్తి గీతానికి జాతీయ నాయకుల ఫొటోలను ప్రదర్శిస్తూ చేసిన నృత్యం అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా రిమ్స్ ఎస్ఐ సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ శక్తి యాప్‌ను అందరూ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచిస్తూ ట్రాఫిక్ నిబంధనలు వివరించారు. కార్యక్రమాలను శిల్పారామం పాలనాధికారి ఎస్.కృష్ణప్రసాద్, ఫీల్డ్ సూపర్‌వైజర్ మధుసూదన్‌బాబు పర్యవేక్షించారు.

### వృద్ధాశ్రమానికి వితరణ



వృద్ధాశ్రమ నిర్వాహకులకు బియ్యం బస్తాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

**కడప ఎడ్యుకేషన్ :** కడప నగరంలోని బృంద స్ఫూర్తి వృద్ధాశ్రమానికి పది బస్తాల బియ్యాన్ని వితరణగా ఇచ్చారు. వైవీయూ ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో వైవీయూ ఆచార్యులు ఎం.వి.శంకర్, వెంకట్రామ్, వైవీయూ సహ ఆచార్యులు ఎం.సుభోష్ చంద్ర, వేనూస్ స్కిల్ అకాడమీ వేణుగోపాల్, రవికుమార్‌రెడ్డి, శ్రీనివాస ఎంబీఏ కళాశాల ప్రిన్సిపాల్ జె.మునయ్య, సిరాజుద్దీన్ (పవర్‌గ్రిడ్), సుబ్బారెడ్డి (మల్లా రెడ్డి కళాశాల, హైదరాబాద్), వేణుగోపాల్ (శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాల), కేఎస్ ఆర్ఎం కాలేజీ నరేషలు మసూర బియ్యం పది బస్తాలను బృంద స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు న్యాయవాది బాలసుబ్బయ్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైవీయూ అధ్యాపకులు డాక్టర్ టి.సురేష్‌బాబు పాల్గొన్నారు.

### ఆశీర్వాదం



వరుడికి వివాహ శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

**కడప కార్పొరేషన్ :** కడప నగరం 47వ డివిజన్ నబీకోటలోని గులశన్ మసీదులో ఖలీల్ అహ్మద్ కుమారుడు షేక్ మహ్మద్ మాజ్, , షేక్ జాకీర్ హుస్సేన్ కుమార్తె నూర్ ఏ ఆయాన్ వివాహ మహోత్సవానికి మాజీ డిప్యూటీ సీఎం అంజద్ బాషా హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వారి కుటుంబ సభ్యులకు వివాహ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం యూఎస్ షాదీఖానాలో జరిగిన రిసెప్షన్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉమైర్ జ్యూవెలర్స్ అధినేత అల్లాబకాష్, షేక్ ఉమైర్, చాన్‌బాషా, బషీర్ అహ్మద్, లైఫ్ కేర్ జిలానీ, రకీబ్, షఫీ పాల్గొన్నారు.

### ఆర్థిక సాయం

**పులివెందుల రూరల్ :** వెంకటాపురం గ్రామానికి చెందిన నిరంజన్ ఫిబ్రవరి 27న అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న 1996-97 బ్యాచ్ రవీంద్రనాథ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు, అలాగే 1997-99 ఇంటర్ బ్యాచ్ విద్యార్థులు, 1999-2022 బ్యాచ్ డిగ్రీ కళాశాల చదివిన విద్యార్థులు కలిసి రూ. 1.80 లక్షలను నిరంజన్ కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు.

# క్రీస్తు పునరుత్థానం.. లోకానికి కొత్త జీవం

- ఘనంగా ఈస్టర్ వేడుకలు
- చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు
- క్రీస్తు సందేశం తెలిపిన ఫాదర్‌లు

**కడప కల్చరల్ :** తన పునరుత్థానంతో తానే జీవమునని క్రీస్తు ప్రపంచానికి చాటారని సీఎస్ఐ సెంట్రల్ చర్చి బిషప్ ఐజాక్ వరప్రసాద్, పాస్టర్ విక్టర్ బాబు అన్నారు. ఆదివారం ఈస్టర్ సందర్భంగా కడప నగరంలోని అన్ని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పలుచోట్ల అర్ధరాత్రి నుంచి మరికొన్నిచోట్ల తెల్లవారుజామున ఐదు గంటల నుంచి ఈస్టర్ ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవ గురువులు ఈస్టర్ విశేషాలను తెలిపారు. క్రీస్తు మరణం నుంచి మూడవరోజు కొత్త జీవంతో పునరుత్థానం చెందడం దైవాన్ని మహిమ పరిచినట్లయిందని అన్నారు. ఈ సందర్భంగా వారు బైబిల్‌లోని క్రీస్తు పునరుత్థాన ఘటనలను భక్తులతో చదివించి అర్థాన్ని వివరించారు. పలువురు గురువులు ఇతర చర్చిలలో ప్రార్థనలు నిర్వహింపజేశారు. క్యాథడ్రల్ చర్చిలో విచారణ గురువులు ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు. మద్రాసురోడ్డులోని రామాంజనేయపురం పాస్టరల్ సెంటర్‌లో కడప కథోలిక పీఠంలో కూడా ప్రార్థనలు చేశారు. ఆరోగ్యమాత పుణ్యక్షేత్రంలో ఆ క్షేత్రం గురువులు దివ్య బలిపూజ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విశ్వాసులకు దివ్య సత్ప్రసాదం అందజేసి ఆశీర్వదించారు. క్రీస్తు శరీరాన్ని త్యాగం చేసినందుకు గుర్తుగా చిన్న రొట్టె ముక్కను, రక్తాన్ని ధారపోసినందుకు ప్రతీకగా ద్రాక్ష రసాన్ని భక్తులకు ప్రసాదంగా అందజేశారు.

**కాంగ్రిగేషనల్ చర్చిలో..**

కడప నగరంలోని కాంగ్రిగేషనల్ టౌన్ చర్చిలో ఈస్టర్ ప్రార్థనలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి జరిగిన ఈ ప్రార్థనల్లో గురువులు ఈస్టర్ సందేశాన్ని చదివి వినిపించి అర్థాన్ని వివరించారు. స్థానిక చిన్నచౌక్‌లోని అశోక్‌నగర్ హోలీజీసెస్ కెథిడ్రల్ చర్చిలో కూడా ఈస్టర్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



భక్తులకు ఆశీర్వదిస్తున్న గురువులు

**కృపా చర్చిలో..**

బిల్టప్ వద్దగల న్యూ నేటివ్ కృపా ప్రార్థనా మందిరంలో దైవజనులు పి.మహేష్, సిస్టర్ శాంతమ్మల ఆధ్వర్యంలో ఈస్టర్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్నవారు మాట్లాడుతూ క్రీస్తు మానవాళి పాపాల పరిహారం కోసం తనను తాను శిలువకు అప్పగించబడ్డాడన్నారు. ప్రజలను ఆధ్యాత్మికంగా చైతన్య పరిచేందుకు శిలువపై మరణించి మూడవరోజు సజీవుడిగా తిరిగి వచ్చాడని, ఆయన చూపిన బాటలో ప్రజలు కక్ష, ద్వేషాలు, చెడు వ్యసనాలకు దూరంగా.. ప్రేమమయ జీవితాలను కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో రవితేజ, శాంతిరాజు, లీలావతి, సుధాకర్, రోజా, అంజలి, నరసయ్య, వానలయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



సీఎస్ఐ చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న విశ్వాసులు



ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న విశ్వాసులు



భక్తిగీతాలను ఆలపిస్తున్న కోయిర్ బృందం

## సమాజ హితం.. 'మానవత' ధ్యేయం

**కడప సెవెన్‌రోడ్స్ :** సమాజ హితాన్ని కాంక్షిస్తూ ప్రజలకు చేరువవుతున్న మానవతా సంస్థ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని మానవత సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ 600 రూపాయలు చెల్లిస్తే ఆ డబ్బు ఎంతోమంది పేదవారికి ఉపయోగపడుతుందన్నారు. ప్రతి రూపాయి సమాజ హితం కోసం ఖర్చు పెడుతున్నామని, ఆడిట్ పకడ్బందీగా ఉందని పేర్కొన్నారు. కుల మతాల రహితంగా మానవతా సేవలు అందిస్తోందని పేర్కొన్నారు. ఒకరి ప్రోత్సాహం మరొకరికి సాయంగా ఉంటుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా శాఖలు ఏర్పడుతున్నాయని, అన్నింటాబాధ్యత కలిగిన వ్యక్తులు సంస్థను ముందుకు తీసుకు వెళ్తున్నారని తెలిపారు. విద్యార్థులకు ప్రోత్సాహకాలు, పర్యావరణ పరిరక్షణ, నైతిక విలువల బోధన, ఆపదలో ఉన్న వారికి పలు విధాలుగా సాయం, ఆస్పత్రి అవసరాలు ఉన్న వారికి అంబులెన్స్ ఏర్పాటు, అవసరమైతే ఫ్రీజర్ బాక్స్‌లు ఏర్పాటు చేశామని వివరించారు. మానవతవాది వాణి ఢిల్లీ చట్టసభల్లో వినిపించాలన్నారు. వేసవిలో గొడుగులు పేదలకు పంపిణీ చేస్తామన్నారు. సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పిఆర్‌టీ సుబ్బరాయుడు, కేంద్ర కమిటీ డైరెక్టర్ రాటాల గోపి, ఆత్మీయ సహకార కమిటీ చైర్మన్ సుబ్రహ్మణ్యం, నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల వ్యవస్థాపకులు బైరెడ్డి రామకృష్ణారెడ్డి, రక్తదాన విభాగం అధ్యక్షులు శివశంకర్‌రెడ్డి, అకౌంట్స్ కమిటీ సభ్యులు చలమారెడ్డి, సుబ్బయ్య, మహిళా సభ్యురాలు నీలవేణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మానవత సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.రామచంద్రారెడ్డి

## అరుళయ్య సేవలు ఆదర్శనీయం

**కడప కల్చరల్ :** బిషప్ అరుళయ్య చేసిన సేవలు జిల్లా క్రైస్తవ లోకానికి ఆదర్శంగా నిలిచాయని శాంతి సేవా సొసైటీ వ్యవస్థాపకులు మడగలం ప్రసాద్ అన్నారు. ఆదివారం అరుళయ్య 48వ బిషప్ పట్టాభిషేక వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సంస్థ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల అలంకరించారు. ఆయన ఘాట్ వద్ద సంస్థ సభ్యులతో కలిసి నివాళులర్పించారు. కడప కథోలిక మేత్రాసనానికి మొదటి బిషప్ అరుళయ్య ఎనలేని సేవలను అందించారని, జిల్లాలో క్రైస్తవం వ్యాప్తికి ఆయన మూల కారణమయ్యారని పేర్కొన్నారు. బిషప్ అరుళయ్య భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని డయాసిస్‌లో సదుపాయాలు కల్పించారని, వాటి వల్లనే నేడు ఈ డయాసిస్‌లో సమస్యలు లేకుండా సువార్తను నలు దిశలా వ్యాప్తి చేయగలుగుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు అమృత, స్రవంతి పావని, లక్ష్మీదేవి, సత్య నారాయణరెడ్డి, జోజప్ప, ఠాగూర్, అరుళయ్య తదితరులు పాల్గొన్నారు.



అరుళయ్య ఘాట్ వద్ద విశ్వాసుల ప్రార్థనలు

## ప్యాసింజర్ రైళ్లు ఆపాలని వినతి

**ఎర్రగుంట్ల(జమ్మలమడుగు) :** కమలాపురంలో గతంలో లాగ అన్ని ప్యాసింజర్ రైళ్లను ఆపాలని ఏపీ డబ్ల్యూజే ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్ తెలిపారు. ఆదివారం ఎర్రగుంట్లలోని రైల్వే రన్నింగ్ రూంను పరిశీలించడానికి వచ్చిన ఏడీఆర్‌ఎం సుధాకర్‌ను కలసి మీడియా ప్రతినిధులు సంయుక్తంగా వినతిపత్రం అందజేశారు. కమలాపురం రైల్వేస్టేషన్ నుంచి మైదుకూరు, ఖాజీపేట, వీరపునాయునిపల్లె, వల్లూరు మండలాలకు ఇక్కడి నుంచి ప్రయాణిస్తుంటారన్నారు. తిరుపతి, హైదరాబాదుకు విద్య వైద్యానికి రైళ్లల్లో ప్రయానించే వారు ఉన్నారన్నారు. స్పందించిన ఏడీఆర్ఎం సుధాకర్ మాట్లాడుతూ రైళ్ల నిలుపుదలపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

**కమలాపురం :** మండలంలో ఇన్‌చార్జి ఎస్ఎఫ్ఓ జనార్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీ నుంచి జరుగుతున్న అగ్ని మాపక వారోత్సవాలు ఆదివారం ముగిసాయి. చివరి రోజు అగ్ని మాపక కార్యాలయంలో స్థానిక ప్రజలకు అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు సంభవిస్తే వాటిని ఎలా ఆర్పాలి అనే అంశాన్ని ప్రత్యక్షంగా చేసి చూపించారు. ఎక్కడైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే 08563 274250, 101కు డయల్ చేయాలన్నారు. అనంతరం అగ్ని మాపక యంత్రాల ప్రదర్శన నిర్వహించారు. అభి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విజయ్‌బాబు మాట్లాడుతూ అగ్ని మాపక అధికారులు సూచించిన జాగ్రత్తలను పాటించి అగ్ని ప్రమాదాలను నివారించాలన్నారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

**వేంపల్లె :** అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా వేంపల్లె అగ్నిమాపక కేంద్రాధికారి శివరామిరెడ్డి ఆధ్వర్యంలో 7వ రోజు ఆదివారం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గురుకుల పాఠశాల మైనారిటీ బాలికలు ప్రిన్సిపాల్ సుగుణమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరయ్యారు. అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు.



కమలాపురంలో అవగాహన కల్పిస్తున్న ఇన్‌చార్జి ఎస్ఎఫ్ఓ జనార్ధన్‌రెడ్డి

## పోరాటాల ఫలితంగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల

**కడప వైఎస్ఆర్ సర్కిల్ :** రాష్ట్రంలో నిరుద్యోగులు ఐక్యంగా అనేక పోరాటాలు చేయడం ద్వారానే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల సాధ్యం అయిందని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ తెలిపారు. ఆదివారం నగరంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. డీఎస్సీ నోటిఫికేషన్‌కు సంబంధించి భవిష్యత్తులో అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. రాష్ట్రంలో 30వేలకు పైగా ఉపాధ్యాయ ఖాళీలు ఉండగా కేవలం 16,347 పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగులను తీవ్ర నిరాశకు గురిచేసిందన్నారు. జిల్లాకు ఒకే పేపర్ ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ నోటిఫికేషన్ లేనందున అభ్యర్థులకు వయోపరిమితి సడలింపు పై రాష్ట్ర ప్రభుత్వం పునర్ ఆలోచించాలని కోరారు. పీఈటీ పోస్టుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. పరీక్ష గడువు 70రోజులు అయినా పెంచాలని కోరారు. పోరాటాల సందర్భంగా డీవైఎఫ్ఐ నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు విశ్వనాథ్ నాయకులు మేరీ కుమార్ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ నాయకుడు శివకుమార్

## నేడు ప్రపంచ వారసత్వ దినోత్సవం

**కడప ఎడ్యుకేషన్ :** కడపలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ - ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో ఏప్రిల్ 21వ తేదీ ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ జి. విశ్వనాథ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమం విద్యార్థులు సమాజంలో సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడం, నిర్మాణ పరిరక్షణను ప్రోత్సహించడం యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన కలిగించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొనాలని తెలిపారు.

### ర్యాలీని విజయవంతం చేయండి

**పులివెందుల టౌన్ :** వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ఈనెల 21వ తేదీన శాంతియుత ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నూర్‌బాషా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రసూల్, ముస్లిం మైనార్టీ నాయకుడు నూరుల్లా, ముస్లిం మైనార్టీ సేవ కమిటీ అధ్యక్షుడు గౌస్‌పీర్‌లు తెలిపారు. గురువారం పట్టణంలోని స్థానిక జామియతుల్ అన్సర్ మసీదులో మైనార్టీ సేవ కమిటీ వారి ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీ నాయకులు సమావేశమై మాట్లాడారు. సోమవారం ఉదయం 9 గంటల నుండి మక్కా మసీదు, వైఎస్సార్ సర్కిల్ మీదుగా తహసీల్దార్ ఆఫీసు వరకు ర్యాలీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

### గుంతను పూడ్చండి

**చింతకొమ్మదిన్నె :** కడప-చిత్తూరు జాతీయ రహదారిపై ఊటుకూరు సమీపంలోని టర్నింగ్ పాయింట్ కోచింగ్ సెంటర్ ఎదురుగా రహదారిపై ఎయిర్‌టెల్ ఫైబర్ కేబుల్ నిర్మాణానికి సంబంధించి పెద్ద గుంతను తీశారు. కానీ పూర్తిగా పుడ్చకుండా వదిలి వేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు గుంతను పుడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

### జాతరలో నాయకులు

**కమలాపురం :** మండలంలోని సంబటూరులో జరిగిన గంగమ్మ జాతరకు నాయకులు భారీ ఎత్తున హాజరయ్యారు. ఆదివారం వైఎస్సార్ మాజీ స్టేట్ హార్టికల్చర్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి ఆహ్వానం మేరకు గ్రామానికి విచ్చేసిన నాయకులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఆర్టీసీ మాజీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, కమలాపురం ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రఘురామిరెడ్డి, సుధీర్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ రామ గోవిందురెడ్డి, భైరవ ట్రాన్స్‌పోర్ట్ అధినేత మహేంద్రరెడ్డి, మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి, వైస్ ఎంపీపీ చెన్నకేశవరెడ్డి తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాయ కర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. అనంతరం విందులో పాల్గొన్నారు.

**చింతకొమ్మదిన్నెలో..**

**చింతకొమ్మదిన్నె :** మండలంలోని నాగిరెడ్డిపల్లెలో దేవర సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రభాకరరెడ్డి ఆహ్వానం మేరకు ఆదివారం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, కమలాపురం ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి, మాజీ ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, స్థానిక పార్టీ నాయకులతో కలిసి విందు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

### విజయోత్సవ ర్యాలీ

**జమ్మలమడుగు :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్డినెన్స్ జారీ చేసి ఎస్సీ వర్గీకరణ చేయడం కోసం కృషి చేయడంతో పట్టణంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ చేయాలంటూ మూడు దశాబ్దాలుగా మందకృష్ణమాదిగ ఆధ్వర్యంలో నిరంతర పోరాటం చేయడంతోనే నేడు నెరవేరబోతుందని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు పిచుక బాబు తెలిపారు. పట్టణంలోని పాత బస్టాండ్‌లో చిన్నయ్య మాదిగ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.

### కుంకుమ బండి ప్రదర్శన

**సింహాద్రిపురం :** మండలంలోని అంకాలమ్మగూడూరులో ఆదివారం అంకాలమ్మ తిరునాల ను పురష్కరించుకుని కడపనాగయ్యపల్లెకు చెందిన గ్రామస్తులు ఇంటికి ఒక పట్టు చీర దా దాపు 108 సేకరించి భక్తి శ్రద్ధలతో కుంకుమ బండిని అలంకరించి ఊరేగింపుగా అమ్మవారి గుడి వద్దకు ప్రదర్శన నిర్వహించారు. రెండవ వారం కావడంతో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు భారీగా తరలివచ్చారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

### గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు

**చింతకొమ్మదిన్నె :** మండలంలోని కొత్తపేట గంగమ్మతల్లి దర్శనానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చారు. ఆలయంలో అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. భక్తులు తమ మొక్కుబడులను చెల్లించుకున్నారు. అనంతరం బంధుమిత్రులతో కలిసి విందు భోజన కార్యక్రమాలలో పాల్గొన్నారు. అలాగే ఆలయ సమీపంలోని వీరభద్రస్వామి, శివాలయం, ఆంజనేయ స్వామి దేవాలయంలో భక్తులు పూజలు చేశారు.

# పుస్తకం.. ప్రియనేస్తం

- నేడు అంతర్జాతీయ పుస్తక దినోత్సవం

**కడప కల్చరల్ :** అమ్మ ఒడి మానవుడికి తొలి బడి అన్నది నానుడి. తెల్ల కాగితం లాంటి చిన్నారులను విజ్ఞాన వంతులుగా తీర్చి ఉత్తమ పౌరులుగా దేశానికి అందిస్తుంది అమ్మ. అవ్వాతాతలు మరింత తోడ్పాటునందిస్తారు. ప్రస్తుతం సమాజంలో ఆ పరిస్థితి లేదు. పాఠ్య పుస్తకాలు మినహా సాధారణ పుస్తకాలు చదివే అలవాటు కనిపించడం లేదు. నేడు అంతర్జాతీయ పుస్తక దినోత్సవం. ఈ సందర్భంర్భంగా జిల్లాలోని పరిస్థితుల గురించి...

పాఠ్యపుస్తకాలు మినహా ఇతర పుస్తకాలు చదివే అలవాటు, తీరిక ప్రస్తుత సమాజంలో తక్కువేనని చెప్పవచ్చు. అరకొరగా ఉన్న గ్రంథాలయాలలో కూడా పోటీ పరీక్షల పుస్తకాల కోసం వచ్చే వారే ఎక్కువ. మన జిల్లాలోనూ ఇదే పరిస్థితి ఉంది. జిల్లాలో కవులు ఎక్కువ గనుక కవిత్వం, కథలు, వ్యాసాలు తదితర పుస్తకాలు ప్రతి సంవత్సరం 10-20 దాక వెలువడుతున్నాయి. దీంతో ఆ వర్గాలు మాత్రం పుస్తకాలకు దూరం కాలేదు. మిగతా ప్రజల్లో కూడా ఈ అలవాటును కల్పించాలని పలువురు రచయితలు, పుస్తకాభిమానులు తమవంతు ప్రయత్నాలు సాగిస్తూనే ఉన్నారు.

**జిల్లాలో..**

జిల్లాలో పదేళ్ల క్రితం వరకు అప్పుడప్పుడు పుస్తకాలు ప్రచురించే ఐదారు సంస్థలు ఉండేవి. టెక్నాలజీ పెరగడంతో రచయితలు విజయవాడ, హైదరాబాదు, బెంగుళూరు తదితర ప్రాంతాలకు వెళ్లి పుస్తకాలను అచ్చు వేయించుకుంటున్నారు. దీంతో స్థానిక ప్రచురణ సంస్థలు శాశ్వతంగా మూతపడ్డాయి. ప్రొద్దుటూరు, కడపలో ఒకటి, అర ఉన్నా కూడా అవి పుస్తక ప్రచురణల నుంచి స్టేషనరీ విక్రయాలకు మారాయి.

**మన చందమామ**

దేశంలో బాల సాహిత్యంలో నంబర్ వన్‌గా నిలిచిన చందమామ పత్రికకు ఎంత గొప్ప పేరుండేదో నిన్నటి తరానికి తెలుసు. ఈ పుస్తకాన్ని మన కడప జిల్లాకు చెందిన వారే ప్రచురించారన్న విషయం జిల్లాకే గర్వకారణం. ప్రస్తుతం బాలసాహిత్యం కోసం పత్రికలు కనిపించడం లేదు. జిల్లాలో బాల సాహిత్యం రాస్తున్న వారిలో ఇటీవల బాలల కథా రచన, పుస్తక ప్రచురణలలో కేంద్ర సాహిత్య అకాడమి పురస్కారం పొందిన చదువుల బాబు ఈ రంగంలో ప్రత్యేకత సాధించారు. ఉపాధ్యాయుడిగా పుస్తకంతో తనకుగల బంధాన్ని పుస్తకాలు రాస్తూ ప్రచురిస్తూ మరింత బలోపేతం చేసుకుంటున్నారు. ప్రస్తుతం తల్లులకు తమ పిల్లలకు కథలు చెప్పే సమయం ఉండడం లేదు. తాతయ్యలు, అమ్మమ్మలు సైతం టీవీలకే అతుక్కుపోతున్నారు. దీంతో చిన్నారులు పుస్తకం వైపు మొగ్గుచూపే అవకాశం ఉండడం లేదు. గ్రంథాలయాలకు ఎక్కువగా ఉద్యోగ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారు మాత్రమే వస్తున్నారు.

**కడపలో..**

కడప బ్రౌన్ గ్రంథాలయంలో రోజూ 200 మంది పాఠకులు వస్తే అందులో సగం పోటీ పరీక్షల కోసం సిద్ధమయ్యేందుకు మాత్రమే వస్తున్నారు. పుస్తకాలను విరివిగా బాలలకు అందుబాటులో ఉంచగలిగినపుడే తిరిగి వారిని పుస్తకం వైపు మళ్లించవచ్చని విజ్ఞులు పేర్కొంటున్నారు. పుస్తకాలు చదివితేగానీ విజ్ఞానం అభివృద్ధి అయ్యే అవకాశం ఉండదని, పరిస్థితి ఇలాగే ఉంటే జిల్లా కవులకు కాణాచి అన్నది నిన్నటిమాటగా మిగిలిపోయే ప్రమాదం ఉందంటున్నారు. విజ్ఞులు ఈ విషయంగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.



గ్రంథాలయంలో పుస్తకాలు

## తపాలా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**కడప వైఎస్ఆర్ సర్కిల్ :** కేంద్ర ప్రభుత్వం తపాలా ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అఖిల భారత తపాలా ఉద్యోగ సంఘం గ్రూప్-సి రాష్ట్ర కార్యదర్శి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని యూటీఎఫ్ కార్యాలయంలో అఖిల భారత తపాలా ఉద్యోగ సంఘం సంయుక్త ద్వైవార్షిక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తపాలా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల సాధనకు సంఘీభావంగా పోరాటాలు చేయాలన్నారు. అనంతరం కడప డివిజన్ ఎన్ఎఫ్‌పిఈ గ్రూప్-సి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షుడిగా పురుషోత్తం, కార్యదర్శిగా జీవి సుబ్బారెడ్డి, సహాయ కార్యదర్శులుగా కెపి రాయుడు, మునాఫ్‌తో పలు సంఘాల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న శ్రీధర్‌బాబు

## పోలేరమ్మ ఆశీస్సులు అందరిపై ఉండాలి

**కడప కార్పొరేషన్ :** పోలేరమ్మ ఆశీస్సులు అందరిపై ఉండాలని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా కోరారు. ఆదివారం 28వ డివిజన్ సాథుచెంగన్న వీధిలో నిర్వహించిన పోలేరమ్మ జాతరకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో వర్షాలు కురిసి, రైతుల వేసిన పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ షఫీ, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు దాసరి శివప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ తోటక్రిష్ణ, కంతా భరత్, కె.మహేష్, సలీం, ఎంఆర్‌జీ రాజగోపాల్, పుల్లయ్య, వెంకటేష్, కళ్యాణ్, చలపతి పాల్గొన్నారు.



పోలేరమ్మ జాతరలో మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

## జేఎన్‌టీయూలో పూర్వవిద్యార్థుల సమ్మేళనం

**పులివెందుల రూరల్ :** పట్టణంలోని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 2కే25 పేరిట ఈసీఈ డిపార్ట్‌మెంట్ విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు పూర్వ విద్యార్థులు మధ్య సంబంధాలను బలపరుస్తాయన్నారు. ఈసీఈ డిపార్ట్ మెంట్ హెచ్ఓడీ షేక్ తాజ్ మహబూబ్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు కళాశాల అభివృద్ధికి తోడ్పడుతాయన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శేషమహేశ్వరమ్మ, ప్రొఫెసర్లు , అధ్యాపకులు పాల్గొన్నారు.